

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్
సా. 6:22 (గురువారం)
సెహరీ
ఉ. 4:59 (శుక్రవారం)



ఫీజు రీయింబర్స్ గురించి మాట్లాడడం

## హాస్యాస్పదం

గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన నిధుల్ని కూటమి చెల్లించింది

కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్ని కొట్టేసేందుకు పేర్ని కుట్ర

వైసీపీ నేతల డ్రామాలపై మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

2

18వ వసంతంలోకి...
సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 13 మార్చి 2025 పేజీలు 8

# ఘనంగా 54వ జాతీయ భద్రత వారోత్సవాలు







- జండాను ఆవిష్కరించి వారోత్సవాలు ప్రారంభించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- యాజమాన్యాల చేతిలో కార్మికుల ప్రాణాలు

విజయవాడ బ్యూరో, మార్చి 12, మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో మంగళవారం 54వ జాతీయ భద్రత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యంగా 54 వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని కార్మికులతో మిగతా 2లో



రెవెన్యూ అంశాలపై

## పట్టు పెంచుకోవాలి

**కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ**

మచిలీపట్నం మేజర్ న్యూస్ : రెవెన్యూ అంశాలపై పట్టు పెంచుకొని మరింత మెరుగైన పనితీరు కనపర్చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డి ఆర్ ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి. ఎస్.డి.సి శ్రీదేవిలతో కలిసి రెవెన్యూ అధికారుల సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) పురోగతి, రీ సర్వే, గ్రామ వార్డు సచివాలయాల సేవలు, మీ భూమి ముటేషన్స్, కోర్టు కేసుల పరిష్కారం, తదితర రెవెన్యూ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అత్యధిక మిగతా 2లో...

రక్షిత మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతకు

## ప్రాధాన్యమివ్వండి



- ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలూ నిర్వహించాలి
- ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో/నందిగామ, మార్చి 12, మేజర్ న్యూస్ : జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య అనేది ఉండకూడదని.. రక్షిత తాగునీటి పథకాల ట్యాంకుల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ నందిగామ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. మిగతా 2లో...

# ఘనంగా 54వ జాతీయ భద్రత వారోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

పాటు సామాన్య ప్రజానీకంలో కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే మహత్తరమైన బాధ్యతను తమపై వేసుకుని ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి ముందుకొచ్చిన కొండపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ వారికి, అన్ని విధాల వారికి సహకరించిన మా డిపార్ట్మెంట్ అధికారులకు మంత్రి ధన్యవాదాలు తెలియజేసారు. మరీ ముఖ్యంగా జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని నా కార్మిక లోక కుటుంబ సభ్యులందరినీ ఇలా కలవడం నాకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఏ రోజైతే నేను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను ఆ రోజు నుండే ఈ రాష్ట్రంలో ఉన్న కార్మికులంతా నా కుటుంబ సభ్యుల కింద భావిస్తున్నాను. నా కుటుంబ సభ్యుల భద్రత నా బాధ్యతగా భావిస్తున్నాను. అందుకే అందరికీ భద్రత పైన అవగాహన కల్పించే ఉద్దేశంతోనే ఈ భద్రతా వారోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని నిర్ణయించమన్నారు. అయితే ఈ వారోత్సవాలలో భాగంగా కేవలం కార్మికులకే కాకుండా సామాన్య ప్రజానీకానికి, విద్యార్థులందరికీ కూడా భద్రత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. 54వ జాతీయ భద్రత వారోత్సవాలు సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ కృషియల్ ఫర్ వికసిత్ భారత్ 2047 అనే నినాదం తో ప్రారంభించడం జరిగిందన్నారు. అంటే కార్మికులు భద్రంగా ఉంటేనే రాష్ట్రం భద్రంగా ఉంటుంది. కార్మికుల భద్రతతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం అవుతుంది అనే స్పష్టమైన సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు. ఈ కలను నిజం చేసే బాధ్యత యాజమాన్యాల పైన కార్మికుల పైన అధికారులందరి పైన ఉందన్నారు. అయితే యాజమాన్యాలు మరింత బాధ్యత తీసుకోవాలనీ, ఎందుకంటే ఎప్పుడైతే కార్మికుడు మీ పరిశ్రమలో అడిగి పెట్టాడో అప్పుడే అతడు ప్రాణం మీ చేతిలో ఉన్నట్లేనని చెప్పారు. అందుకే రోజు తప్పకుండా భద్రతా ప్రతిజ్ఞ ను పాటించి దానిపైన అవగాహన కలిగించాలన్నారు. అలాగే భద్రత నియమాలని చాలా సరళమైన భాషలో కార్మికులం దరికీ అర్థమయ్యేలా స్థానిక భాషలలో రూపొందిం చాలన్నారు. రసాయన పరిశ్రమల్లో పనిచేసే కార్మికులం దరికీ రసాయనాల పట్ల,వాటి వలన జరిగే ప్రమాదాల పట్ల శిక్షణ తరగతులను నిర్వహించాలనీ,స్మోక్ అలారం,వంటి ప్రమాదాల్ని ముందుగానే పసిగట్టి నివారించేటట్లు టెక్నాలజీని వాడుకోవాలన్నారు. అయితే ఇందులో కార్మికుల పాత్ర చాలా కీలకమన్నారు. అందులో కార్మికులందరూ తప్పనిసరిగా సేఫ్టీ కిడ్స్ వేసుకునే పని ప్రాంతాల్లో తిరగాలి. నాకు ఒక కార్మికుడు హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడిపోతుంది అని చెప్పి పెట్టుకోవడం లేదని సమాధానం చెప్పాడన్నారు. జుట్టు కన్నా ప్రాణం గొప్పదని తెలుసుకోవాలన్నారు. మీరు అశ్రద్ధగా ఉంటే మీతో పాటు చుట్టుపక్కల కార్మికుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని తెలుసుకోవాలన్నారు. మీరు క్షేమంగా తిరిగి రావాలని మీ కుటుంబం మీ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తుందన్న విషయాన్ని మీరు ఎప్పుడూ గుర్తుంచుకోవాలనీ మంత్రి గుర్తు చేశారు. మొన్న ఒక పరిశ్రమంలోని ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదం జరుగుతున్న ప్రాంతాన్ని మిగతా కార్మికులంతా సెల్ఫీ తీసుకోవడం నా దృష్టికి వచ్చిందనీ, ప్రాణాలతో చెలగాటం ఆడే ఇలాంటి సరదాలు చేయకూడదనీ కార్మికులకు హితవు పలికారు. ముఖ్యంగా మన ప్రభుత్వం ప్రభుత్వం కొన్ని కీలక బాధ్యతలు తీసుకుంటుందనీ దానిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ కు తీసుకోవలసిన చర్యలు గురించి సలహాలు ఇవ్వడానికి వసుధ మిశ్రా నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ కమిటీ రిపోర్ట్ ఒక నెలలో కొలిక్కి వస్తుందనీ, వచ్చాక ఆ కమిటీ రిపోర్ట్ ఆధారంగా అన్ని భద్రతా చర్యలను తూచా తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ రకంగా యాజమాన్యాలు కార్మికులు ప్రభుత్వ యంత్రాంగము అందరూ కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతోనే ముందుకు వెళ్లాల్సిందిగా మంత్రి కోరారు. కార్మిక లోకపు కళ్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ మంత్రి వాసంశెట్టి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు కొండపల్లి ఇండస్ట్రీస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రతినిధి రామచంద్రరావు, రామ్స్ ప్లాంట్ హెడ్ ఆశిష్ కుమార్, కెసిపి ప్లాంట్ హెడ్ మధుసూదన్ రావు, జాయింట్ చీఫ్ ఆఫ్ ఇన్స్పెక్టర్ మోహన్ రావు, ఉషశ్రీ, డి సి ఐ పి శివకుమార్ రెడ్డి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.



**ఉత్సాహంగా సమైక్యత వాక్**

అంతకుముందు ఉదయం విజయవాడ బి ఆర్ టి ఎస్ రోడ్ లో విద్యార్థులు కార్మికులతో కలసి సమైక్యత నడక కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం మాక్ నిర్వహించి మంత్రికి వందనాలు తెలిపారు. ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ కార్మికులను విద్యార్థులను అభినందించారు అనంతరం వారితో కలిసి ఫలహారం కార్యక్రమంలో పాల్గొని వారితో మాట్లాడుతూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం రైల్వే కమిటీ హాల్లో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

---

### ఫీజు రీయింబర్స్ గురించి వైసీపీ మాట్లాడడం

# హాస్యాస్పదం

**వైసీపీ నేతల డ్రామాలపై మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వైసీపీ నేతల డ్రామాలు,వీధి నాటకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విద్యా వ్యవస్థ విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసే లక్ష్యంతో విద్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు చేశాం. విద్య వైద్య రంగాలతో పాటు మానవ వనరుల అభివృద్ధి కోసం చేసే ప్రతి పైసా కూడా పెట్టుబడేనని వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలి. గతంలో విద్యార్థులు చదువుకునే కాలేజీలకు ఫీజులు చెల్లించి బకాయిలు లేకుండా చూసుకున్నాం. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక తల్లిదండ్రుల ఖాతాల్లో వేయడంతో, కాలేజీలకు చెల్లించని సమయంలో విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. కూటమి అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో అన్ని కాలేజీలకు కీలకమైన ఆదేశాలిచ్చాం. బకాయిల విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడానికి వీల్లేదని ఆదేశించాం. జగన్ రెడ్డి పెట్టిన బకాయిల్లో రూ.750 కోట్లు ఇప్పటికే చెల్లించాం. జగన్ రెడ్డి అండ్ కో రోడ్డెక్కి పోరాడతామంటే పోయేది వారి పరువే. వారు చేసిన అరాచకాలన్నీ బయటపడతాయని గుర్తుంచుకోవాలన్నారు. ఏ కాలేజీకి కూడా బకాయిలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజా సమస్యలపై జగన్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే..తక్షణమే అసెంబ్లీకి రావాలి. అసెంబ్లీకి వస్తే బండారం మొత్తం బయటపడు తుందనే భయంతో అసెంబ్లీకి రాకుండా వీధుల్లో డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు దొంగ జీవోలు, దొంగ ఆదేశాలతో రాష్ట్రాన్ని లూటీ చేసి ఇప్పుడు రోడ్డెక్కితే ప్రజలు చూస్తూ ఊరుకోరు. బందరుకు వన్నెతెచ్చిన పట్టాభిసీతారామయ్య పేరుతో మెమోరియల్ కట్టేందుకు ప్రయత్నిస్తే ఇప్పటికీ మున్సిపాలిటీలో తీర్మానం చేయకుండా అడ్డుకుంటున్న పేర్ని నాని పార్టీ కార్యాలయం పేరుతో డ్రామాలు సరికాదు. ఆంధ్రా బ్యాంకు, యూనియన్ బ్యాంకు మెమోరియల్ కోసం ముందుకు వచ్చినా ఉద్దేశ్యపూర్వకంగా అడ్డుకుని యువతకు ఉద్యోగ ఉపాధి అవకా శాలు లేకుండా చేశారు. పార్టీ కార్యాలయం పేరుతో రూ.50 కోట్ల విలువైన భూమిని కొట్టేయాలనుకోవడం దుర్మార్గం. జీవో నెం.340 ప్రకారం ఏడాది కాలంలో నిర్మాణాలు చేయాలి. అదే సమయంలో కోర్టు స్టేటస్ కో ఇచ్చిన భూమికి జిల్లా అధికారు లెవ్వరూ ఇంకా పొజిషన్ ఇవ్వకుండా నిర్మాణాలు ఏ విధంగా చేస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో అక్రమ కట్టడాలంటూ ప్రజావేదికను కూల్చేశారు. కానీ నేడు అక్రమ కట్టడాలను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. జగన్ రెడ్డి అండ్ కో వీధి నాటకాలను మానుకోకపోతే ప్రజలు మరింత కఠినమైన తీర్పులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

---

# రెవెన్యూ అంశాలపై పట్టు పెంచుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యతనిస్తోందని ప్రజల నుండి అందే అర్జీలను నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించి సకాలంలో పరిష్కరించాలన్నారు. జిల్లాలో మొత్తం 8091 అర్జీలు అందగా 1248 అర్జీలు ఇంకను అపరిష్కృతంగా ఉన్నాయని, అందులో మచిలీపట్నంలో 300, గుడివాడలో 273, ఉయ్యూరు డివిజన్లో 675 అర్జీలు ఉన్నాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. నిర్ణీత గడువు దాటే చివరి నిమిషం వరకు ఆగకుండా కొంత సమయం కేటాయించి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అర్జీలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి సంబంధిత అర్జీదారులతో విచారించి ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ మేరకు చేయగలము సానుకూలంగా చేయాలని, అట్లు చేయలేని పక్షంలో అందుకు సంబంధించిన కారణాలను విధిగా తెలియజేస్తూ తప్పనిసరిగా సంబంధిత అర్జీదారులకు ఎండార్స్మెంటు నేరుగా గాని, పోస్ట్ ద్వారా గాని చేరవేయాలన్నారు. పరిష్కరించి ముగించిన అర్జీలను కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిల్లో ఆడిట్ చేయడం జరుగుతుందని అర్జీదారులతో ఫోన్లో మాట్లాడి వారు సంతృప్తి చెందారా లేదా అని వారి అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందన్నారు. కొందరు క్షేత్రస్థాయిలో అర్జీదారులకు ఎండార్స్మెంటు అందజేయడం లేదని ఇకపై అలా చేయరాదని స్పష్టం చేశారు. అలాగే ఆడిట్లో తప్పుడు ఎండార్స్మెంట్ ఇచ్చినట్లు తేలితే సంబంధిత అధికారులను వివరాలు కోరడం జరుగుతుందన్నారు. ఏదైనా అర్జీకి పూర్తిస్థాయిలో పని పూర్తి అయితేనే పరిష్కరించినట్లుగా ఆ అర్జీని ముగించాలన్నారు. జిల్లాలో మొత్తం 475 రీఓపెన్ అర్జీలు ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అర్జీదారులకు నోటీసులు ఇచ్చి సరిగా విచారణ జరిపి సజావుగా పరిష్కరించాలన్నారు. మ్యుటేషన్ తదితర సేవలు అందించే ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో విచారణ చేశారా లేదా అని నోటీసులు అందాయా లేదా అని ఐవిఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం విచారిస్తోందన్నారు. కింది స్థాయి సిబ్బందిని అదుపులో పెట్టుకొని అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడేలా,పర్యవేక్షించాలన్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్త స్థాయి పెరగాల్సి ఉందని, ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినే విధంగా ఎవరూ కూడా ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ కింద 72 షోకాస్ నోటీసులు ఇవ్వగా ఇంకనూ 17 వాటికి సమాధానాలు అందలేదన్నారు. అలాగే సర్వేకు సంబంధించి 398 షోకాజ్ నోటీసులు జారీ చేయగా 316 నోటీసులకు ఇంకను జవాబు అందలేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదని నిర్లక్ష్యం వీడి ఇకనైనా పని తీరు మెరుగుపరుచుకోవాలన్నారు. సి ఎం ఓ, డిప్యూటీ సీఎం నుండి అందే అర్జీలను కూడా చాలా జాగ్రత్తగా పరిష్కరించి కలెక్టర్, నోడల్ అధికారి సంతకాలతో ముగించాల్సి ఉంటుందన్నారు. ఎఫ్ఎంబి లోని హద్దులకు, భూమిపైన వాస్తవంగా ఉన్న హద్దులకు సరిపోలిస్తే అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లో తేడాలు కనిపిస్తున్నాయని ఆ విధంగా ఏమైనా తేడాలు ఉంటే ఒకసారి వ్యక్తిగతంగా మరలా గమనించాలన్నారు. తాను గాని, సంయుక్త కలెక్టర్ గాని క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు తప్పనిసరిగా ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అందరూ ఇందుకు సంబంధించిన నివేదికను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తహసిల్దారు, మండల సర్వేయరు, ఆర్ ఎస్ డి టి ముగ్గురు ప్రతిరోజు సాయంత్రం ఒకసారి భూమి విస్తీర్ణం పై చర్చించుకోవాలన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న కోర్టు కేసుల పరిష్కారం కు కృషి చేయాలన్నారు. ఆన్లైన్లో యు.ఎస్.ఆర్ నంబర్ వచ్చినప్పుడే కౌంటర్ ఫైలు దాఖలు చేసినట్లుగా పరిగణించాలని స్పష్టం చేశారు. సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు సంబంధించి 4,877 అర్జీలు అందాయని వాటిలో ఇంకను 395 పెండింగ్లో ఉన్నాయన్నారు. ఈనెల 24,25 తేదీలలో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనున్న దృష్ట్యా ఆలోగా వాటిని పరిష్కరించాలన్నారు. సర్వే సెటిల్మెంట్కు సంబంధించి 147 కేసులు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా ఈనెల 20వ తేదీలోగా,పరిష్కరించాలన్నారు. సచివాలయంలో కార్యదర్శులు ఏ సమయంలో అందుబాటులో ఉంటున్నారో ప్రజలకు తెలియక ఇబ్బంది పడుతున్నారని వారికి తెలిసేలా ఏర్పాట్లు సజావుగా చేయాలన్నారు. జిల్లాలో రెండవ దశలో 23 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ సర్వే చేపట్టగా 19 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని మిగిలిన 4 గ్రామాల్లో కూడా వెంటనే సర్వే పూర్తి చేయాలన్నారు. వచ్చే ఏప్రిల్ నెల 15వ తేదీ లోగా 13 నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. పట్టాదారులకు అపీలు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. పట్టాల సబ్ డివిజన్, ఆన్లైన్ సబ్ డివిజన్ గడువు మీరకుండా చూడాలన్నారు. సర్వే రాళ్ల వినియోగానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను వెంటనే పంపాలన్నారు. ఈ సమావేశంలో మచిలీపట్నం గుడివాడ ఉయ్యూరు ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రమణ్యం, హేల షరూన్, సర్వే భూరికార్డుల ఏడి జోషీలా, కలెక్టరేట్ ఏవో ఆంజనేయ ప్రసాద్, పలువురు తహసీల్దార్లు, మండల సర్వేయర్లు తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

---

## రక్షిత మంచినీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా విస్తృతంగా పర్యటించారు. తొలుత నందిగామ మండలం, అంబారుపేట గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకును పరిశీలించారు. ట్యాంకులను ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ప్రశ్నించారు. ప్రజారోగ్య భద్రతతో ముడిపడియున్నందున తప్పనిసరిగా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామంలోని బోరును పరిశీలించి, నీటిని తాగి పరిశీలించారు. అనంతరం మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను పరిశీలించారు. నీటి వనరులకు సంబంధించి ఫ్లషింగ్ లేదా పూడికతీత, బోరుబావులు, ఇతర బావులను లోతు చేయడం వంటి పనులు ఇంకా ఏవైనా పెండింగ్ ఉంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

**అనాసాగరం రైతుల సమస్యను పరిష్కరించండి**

నందిగామ పురపాలక సంఘం శివారు అనాసాగరం గ్రామ రైతులు.. కలెక్టర్ను కలిసి వరి పంటకు సాగునీటి విడుదలకు విజ్ఞప్తి చేశారు. నవాబుపేట చెరువు కింద తమ గ్రామానికి చెందిన సుమారు 150 ఎకరాల్లో వరి పంట వేశామని, ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉందగా చెరువు నుండి నీళ్లు వదలడం లేదని తెలిపారు. కాకుల పొన్నవరం నుంచి శనగపాడు సప్లయ్ ఛానల్ ద్వారా సరఫరా నిలిచిపోవడం, మునేరులో చుక్కనీరు లేకపోవడం తదితరాల వల్ల మరో 400 ఎకరాలకు నీటి సమస్య ఏర్పడిందని వివరించారు. స్పందించిన కలెక్టర్.. ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి అనాసాగరం గ్రామ రైతుల సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో కలెక్టర్ లక్ష్మీశ వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ విద్యాసాగర్, నందిగామ తహసీల్దార్ ఎన్.సురేష్, ఎంపీడీవో శ్రీనివాసరావు, స్థానిక అధికారులు తదితరులు ఉన్నారు.

# వన్డెర్ ల్యాబ్స్ కార్యక్రమాన్ని నిర్వహించిన జాన్సన్స్ బేబీ



విజయవాడ, మార్చి 12, మేజర్ న్యూస్ : అగ్రగామి బేబీ కేర్ బ్రాండ్ అయిన జాన్సన్స్ బేబీ, వన్డెర్ ల్యాబ్స్ పేరిట మెగా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఇంటరాక్టివ్, అనుభవపూర్వక కార్యక్రమంలో 2,000 మంది పైగా మాతృమూర్తులు (ఇన్-పర్సన్, వర్చువల్‌గా), నిపుణులు, దేశవ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. శిశువుల చర్మానికి సంబంధించిన శాస్త్రీయత, అలాగే మొదటి రోజు నుంచే శిశువుల చర్మ సంరక్షణలో సహాయపడే జాన్సన్స్ బేబీస్ వినూత్న ఫార్ములేషన్స్ గురించి అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మాతృమూర్తులు పాల్గొన్నారు. జాన్సన్స్ బేబీస్ ఫార్ములాలకు మూలస్తంభాలైన దశాబ్దాల సైన్స్, పరిశోధనల గురించి తెలుసుకున్నారు. అలాగే జాన్సన్ బేబీ ప్రోడక్టుల తయారీ గురించి, అత్యంత జాగ్రత్తగా ఎంపిక చేసే ముడిపదార్థాల గురించి అర్థం చేసుకున్నారు. వివిధ జాన్సన్స్ బేబీ ఉత్పత్తుల గురించి వివరంగా తెలుసుకున్నారు. వీటిలో ఎలాంటి హానికరమైన రసాయనాలు ఉండవు. అన్ని ఉత్పత్తులు డెర్మటాలజిస్టులచే పరీక్షించబడినవై ఉంటాయి. ఫార్ములేషన్లలోని 96% ముడిపదార్థాలు సహజసిద్ధమైనవి ఉంటాయి. వన్డెర్ ల్యాబ్స్ కార్యక్రమంలో శిశు చర్మానికి సంబంధించిన శాస్త్రీయతపై 15 ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ ప్రయోగాలు నిర్వహించబడ్డాయి. అలాగే, శిశువుల యొక్క విభిన్నమైన చర్మ సంరక్షణలో నిరంతరాయంగా ప్రమాణాలను నెలకొల్పుతున్న జాన్సన్స్ అత్యుత్తమ ఉత్పత్తుల శ్రేణి వెనుక శాస్త్రీయత గురించి వివరించబడింది. శిశువు కళ్లకు ఇబ్బంది కలగకుండా సంరక్షించే అధునాతన సాంకేతికత అయిన నోమోర్ టియర్స్ ఫార్ములా, అలాగే ఒకవైపు శిశువు చర్మపు సహజసిద్ధమైన పీహెచ్, తేమను కాపాడుతూనే, మరోవైపు చర్మంలోకి చొచ్చుకుపోకుండా సమర్థవంతంగా శుభ్రపర్చే పెద్ద మిసెల్స్‌తో కూడుకున్న, విశిష్టమైన జెఐఎం ఆధారిత పీహెచ్ బ్యాలెన్స్‌డ్ క్లీన్సర్స్ మొదలైన ఆవిష్కరణలు వీటిలో ఉన్నాయి. ఈ కార్యక్ర మంలో పలువురు నిపుణులు కూడా పాల్గొన్నారు. కన్సల్టెంట్ పీడియాట్రీషియన్, నియోనేటాలజిస్ట్ డా.సగుల్ రామానుజ ముగునాథన్, ఎంబిబియస్, యండి (పేస్),



## తమ పేరెంటింగ్ అనుభవాలను షేర్ చేసుకున్న సెలబ్రిటీలు

ఐడిపిసిసియం, పిజిపియన్ (బోస్టన్), బసవేశ్వర్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎండీ డా.శాలిని (ఎంబిబియస్, యండి) లాంటి ఇన్-హౌస్, బైటి నిపుణులను మాతృమూర్తులు సంప్రదించేందుకు ఇందులో అవకాశం లభించింది. మొదటి రోజు నుంచి శిశువు చర్మాన్ని సంరక్షించేందుకు పాటించాల్సిన ఉత్తమ విధానాలను నిపుణులు తెలియజేశారు. శిశువుల చర్మ సంరక్షణపై సాధారణంగా నెలకొన్న అపోహలను నివృత్తి చేశారు. అలాగే ఇండియన్ అకాడెమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఏపీ) నిర్దేశించిన చర్మసంరక్షణ మార్గదర్శకాలను వివరించారు. జాన్సన్స్ బేబీ వెనుక శాస్త్రీయతను గురించి మాట్లాడుతూ, "జాన్సన్స్ బేబీ చేసే ప్రతి పని వెనుక వినూత్నత ఉంటుంది. శాస్త్రీయత దన్నుగల సురక్షితమైన ఉత్పత్తులను సృష్టించాలనేది మా లక్ష్యం. జాన్సన్స్ బేబీకి చెందిన ప్రతి ఉత్పత్తిలోనూ ఈ లక్ష్యం ప్రతిఫలిస్తుంది. దశాబ్దాల పరిశోధనలు, శాస్త్రీయత దన్నుతో తొలి రోజు నుంచి శిశువు చర్మ సంరక్షణలో తోడ్పడతామన్న హామీని మా ఉత్పత్తులు ప్రతిఫలిస్తాయి. విస్తృతమైన మా శాస్త్రీయత విశేషాలు, మా ఉత్పత్తుల గురించి, వాటిలో ఉపయోగించిన ముడిపదార్థాలు, వాటి ఫార్ములేషన్స్ గురించి, తరతరాలుగా పేరెంట్స్/తల్లులకు విశ్వసనీయమైన ఎంపికగా జాన్సన్స్ బేబీ నిలుస్తుండటం వెనుక కారణాల గురించి మాతృమూర్తులు సవివరంగా తెలుసుకునేందుకు మా విశిష్టమైన వన్డెర్ ల్యాబ్స్ నిర్వహించాం" అని కెన్వ్యూ బిజినెస్ యూనిట్ హెడ్ – ఎసెన్షియల్ హెల్త్, స్కిన్ హెల్త్, మార్కెటింగ్ వీపీ మనోజ్ గాడ్గిల్ తెలిపారు. "ప్రతి పేరెంట్ పట్ల మేము చూపే నిబద్ధతకు నిదర్శనంగా, జాన్సన్స్ బేబీ సృష్టించే ప్రతి ప్రోడక్టుకు కఠోర పరిశోధన, శాస్త్రీయత పునాదులుగా ఉంటాయి. శిశువుల చర్మసంరక్షణలో అగ్రగామి సంస్థగా ఏళ్ల తరబడి శిశు చర్మ శాస్త్రీయతపై నిర్వహించిన విస్తృతమైన పరిశోధనలు మాకెంతో గర్వకారణం. ప్రపంచవ్యాప్తంగా శిశు సంరక్షణకు సంబంధించి మేము కనుగొన్న విషయాలు, కొత్త ప్రమాణాలను నెలకొల్పడమే కాకుండా శిశు చర్మ సంరక్షణ శాస్త్రీయతలో పురోగమించేందుకు, శిశువుల సున్నితమైన చర్మం గురించి మరింత లోతుగా తెలుసుకునేందుకు మాకు సాధికారత కల్పిస్తాయి. చర్చాగోష్ఠులు, ప్రదర్శనల ద్వారా మాతృమూర్తులు ఈ శాస్త్రీయతను అర్థం చేసుకునేందుకు, తమ శిశువుల గురించి సరైన ఎంపికలు చేసుకోవడంలో తోడ్పడేందుకు జాన్సన్ వన్డెర్ ల్యాబ్స్ నిర్వహించింది" అని కెన్వ్యూ ఆర్ & డీ డైరెక్టర్ (రీజనల్ హెడ్–బేబీ & ఉమెన్స్ హెల్త్) డా.దిలీప్ త్రిపాఠి తెలిపారు

# రైతులను సాగునీరు అందించి ప్రభుత్వం ఆదుకోవాలి



నందిగామ, మార్చి 12, మేజర్ న్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం అనాసాగరం శనగపాడు సవరాల వరిమాగానికి పంటకు సాగునీరు అందించాలి సిపిఎం డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ. మొన్న వచ్చిన వరదల వలన గతంలో వేసిన పంటలు మొత్తం వరదకి నష్టపోవటం వల్ల మళ్ళీ తిరిగి వరి సాగు రైతులు సాగు చేసుకోవడం జరిగింది.ఆ సమయంలో మార్చి నెలాఖరి దాకా సాగు నీరు అధిస్తాము అని అధికారులు చెపితే రైతులు వరి సాగు చేసుకున్నారు,కానీ ఇప్పుడు వచ్చేసరికి పంట చేతికి వచ్చే సమయానికి నీళ్లు లేక మొత్తం నేర్రలు కొట్టే పరిస్థితి ఈరోజు నందిగామ మండలం అనాసాగరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తా ఉన్నారు మరి ప్రభుత్వం గత వరదలు వల్ల నష్టపోయిన వాటికి కూడా ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదు. ఇప్పటికైనా మరి ఈ సాగు చేసుకుంటున్నా దానికి నీరు అందిస్తాం సాగర్ ద్వారా అలాగే వాగు ద్వారా అందిస్తామన్నారు. ఇంతవరకే నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మాత్రం ఆ సాగు చేసుకున్న భూములు పంటల వైపు కూడా తిరిగి చూడని పరిస్థితి కనపడతా ఉంది. అందుకనే ప్రభుత్వం తక్షణమే ఆ సాగర్ ద్వారా ఈ పంటలు చేతికి వచ్చిన వాటికి నిరుని అందించాలి, లేదా ఒక ఎకరానికి పెట్టుబడి 35000పెట్టారు,నష్టపరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా సిపిఎం పార్టీగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసీం,గోపి నాయక్,కర్రి వెంకటేశ్వరావు,షేక్ హుస్సేన్,రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ బుక్5 సిరీస్ పీసీలు



విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ తాజా ఏఐ పవర్డ్ పీసీ శ్రేణి గెలాక్సీ బుక్ 5 ప్రో, గె లాక్సీ బుక్ 5 ప్రో 360, గెలా క్సీ బుక్ 5 360లను విడుదల చేసింది. కొత్త శ్రేణి ఏఐ పీసీలు గెలాక్సీ ఏఐ యొక్క శక్తిని మైక్రోసాఫ్ట్ యొక్క కోపైలట్ ప్లస్ పీసీ అనుభవంతో మిళితం చేస్తాయి. ఇది సజావుగా ఉత్పాదకత, సృజనాత్మకత, తెలివైన వర్క్‌ఫ్లోలను నిర్ధారిస్తుంది. ఇంటెల్ కోర్ అల్ట్రాతో తీర్చిదిద్దిన గెలాక్సీ బుక్5 సిరీస్ రూ. 114990 నుండి ప్రారంభమవుతుంది. ఏఐ సెలెక్ట్, ఫోటో రీమాస్టర్ వంటి గెలాక్సీ ఏఐ ఫీచర్లతో, శక్తివంతమైన ఎన్పీయూల ఇంటెల్ కోర్ అల్ట్రా సిరీస్ 2 ప్రాసెసర్‌లతో శక్తివంతం అయింది. సూపర్–ఫాస్ట్ ఛార్జింగ్‌తో 25 గంటల వరకు బ్యాటరీ లైఫ్‌తో వస్తుంది.

## పట్టణంలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పెడన మేజర్ న్యూస్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను పట్టణ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించామని నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఉప్పల రమేష్ (రాము )అన్నారు. ఈ మేరకు వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పాల మాట్లాడుతూ కోటమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్సిపి పార్టీని అణిచివేయాలనే ధోరణితో అక్రమ కేసులు తమ నాయకులపై బనాయిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అనంతరం పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నాయకులకు కార్యకర్తలకు పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కార్యకర్తల నడుమ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పల హారిక,పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యులు, 4 మండలాల జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం



పమిడిముక్కల మేజర్ న్యూస్ : పమిడిముక్కల మండలం మంటాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కన్నుల పండుగ జరిగింది. ఈ బ్రహ్మోత్సవాలు భాగంగా ఉదయం నిత్య ఉపాసన నిత్య హోమం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణ మహోత్సవం భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అగస్త్యరాజు రామమోహనరావు, కార్యనిర్వహణ అధికారి ఆర్.మాధవీలత ల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కె.టి.కె.వి రామానుజచార్యులు, జి.టి.రంగమన్నార్ స్వామిలు కళ్యాణం నిర్వహించగా పి.గౌతమ్ కుమారాచార్యులు, రాజగోపాలచార్యులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# మూడోసారి విజయవంతంగా కిడ్నీ మార్పిడి

శరత్స్ ఇనిస్టిట్యూట్ అరుదైన ఘనత

మొదటిసారి తల్లి, రెండోసారి భర్త.. ఇప్పుడు తండ్రి

మహిళకు మూడుసార్లు కిడ్నీ దానం చేసి ఆదర్శంగా నిలిచిన కుటుంబసభ్యులు

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా డయాలసిస్ సేవలు, కిడ్నీ మార్పిడి చికిత్సలు

విజయవాడ మేజర్ న్యూస్: నగరంలోని శరత్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఒకే మహిళకు మూడోసారి కిడ్నీ మార్పిడి అవసరం కాగా.. ప్రఖ్యాత నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జి. శరత్ బాబు నేతృత్వంలోని వైద్య నిపుణులు అన్ని సంక్లిష్టతలను అధిగమించి కిడ్నీ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అత్యంత అరుదైన ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను తెలియజేసేందుకు బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సూర్యారావుపేటలోని శరత్స్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ జి. శరత్ బాబు మాట్లాడుతూ.. "నందిగామ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల వయసు మహిళకు ఇటీవల కిడ్నీ మార్పిడి చికిత్స నిర్వహించాం. గతంలో ఈ మహిళకు రెండు పర్యాయాలు కిడ్నీ మార్పిడి జరిగింది. మరోసారి కిడ్నీ విఫలం కావడంతో ట్రాన్స్ప్లాంటేషన్ అవసరమైంది. పేషెంటుకు మూడుసార్లు కూడా ఆమె కుటుంబసభ్యులే కిడ్నీలు దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. మొదటిసారి తల్లి, రెండోసారి భర్త కిడ్నీ దానం చేయగా.. ఇప్పుడు పేషెంట్ తండ్రి కిడ్నీ దానం చేసి తన కుమార్తెకు పునర్జీవితాన్ని ప్రసాదించారు" అని అన్నారు. ఒకే వ్యక్తికి మూడోసారి కిడ్నీ మార్పిడి చేయడం అత్యంత అరుదైనదిగా చెప్పుకోవచ్చు. శరత్స్ ఇనిస్టిట్యూట్‌లో ఇప్పటి వరకు అనేక కిడ్నీ మార్పిడి చికిత్సలను విజయవంతంగా నిర్వహించాం. అత్యాధునిక 24x7 హీమో డయాలసిస్ యూనిట్ ద్వారా నెలకు 2000 డయాలసిస్ చికిత్సలు నిర్వహిస్తున్నాం. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా డయాలసిస్ సేవలు, కిడ్నీ మార్పిడి చికిత్సలు అందిస్తున్నాం. కిడ్నీ మార్పిడి చికిత్స అనంతరం కోలుకుంటున్న పేషెంటును ఈరోజు డిశ్చార్జి చేస్తున్నాం" అని డాక్టర్ జి. శరత్ బాబు వివరించారు. కిడ్నీ మార్పిడి చికిత్స చేయించుకుని కోలుకున్న పేషెంట్ మాట్లాడుతూ.. తనకు కిడ్నీలను దానమిచ్చిన తన




కుటుంబసభ్యులకు, కిడ్నీ మార్పిడి చేసి తన ప్రాణాలను నిలబెట్టిన డాక్టర్ శరత్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మూడోసారి కిడ్నీ మార్పిడి చేయించుకుంటున్న తనకు డాక్టర్ శరత్ బాబు అద్భుత వైద్యం అందించడమే కాకుండా, అవసరమైన మనోధైర్యాన్ని కూడా ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో శరత్స్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ జి. వెంకట్రావు, డాక్టర్ జి. ప్రశాంతి, డాక్టర్ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాను పరిశీలించిన చైర్మన్ కృష్ణకుమారి



నందిగామ, మార్చి 12, మేజర్ న్యూస్ : పట్టణం లో పలు ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి పర్యటించారు. తహసిల్దార్ కార్యాలయంలో మంచినీటి పంపు లీకేజ్ కారణంగా తాగునీరు వృధా అవుతున్నాయి ఈ విషయాన్ని గాంధీ ద్వారా తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి తక్షణమే స్పందించి అధికారులను ఆదేశించి మరమ్మత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు పాలిటెక్నిక్‌లో ఉచిత పాలిసెట్ శిక్షణ



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : పాలిటెక్నిక్ విద్యలో 44 సం.లుగా నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందిస్తూ, ప్రతి ఏటా విద్యార్థినీ, విద్యార్థులకు అనేక బహుళ జాతి సంస్థలలో వార్షికవేతనం గరిష్టంగా 9.02 లక్షల రూపాయలతో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ, ప్రతి సంవత్సరం ఈ సెట్ పరీక్షల్లో టాప్ టెన్ ర్యాంకు లలో అత్యధిక ర్యాంకులు సాధిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రైవేట్ పాలిటెక్నిక్ గా గుర్తింపు పొందిన గుడ్లవల్లేరు ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్ తరగతులు ఏప్రిల్ 3 నుండి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్ తెలిపారు. 2025 ఏప్రిల్ 30న మొత్తం 120 మార్కులకు జరిగే ఏపి పాలిసెట్ పరీక్షల్లో గణితం 50 మార్కులు, ఫిజిక్స్ 40 మార్కులు, కెమిస్ట్రీ 30 మార్కులకు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే గుడ్లవల్లేరు కళాశాలలో నిర్వహించే ఉచిత పాలిసెట్ శిక్షణ కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 8.30 గంటల నుండి తరగతులు నిర్వహణ సుదీర్ఘమైన అనుభవం కలిగిన అధ్యాపకులచే, విశాలమైన, ఆహ్లాదకరమైన తరగతి గదులలో బోధన నిర్వహిస్తామన్నారు. ప్రతి స్టూడెంట్ పై ప్రత్యేక శ్రద్ధతో, సందేహాలపై అప్పటి కప్పుడే తరగతి గదిలో నివృత్తి చేయడం, ప్రతి రోజు షెడ్యూల్ ప్రకారం క్లాసుల నిర్వహణ, డైలీ టెస్టులు,గ్రాండ్ టెస్టులు, మోడల్ పాలిసెట్ పరీక్షలు జరుపుతామని, ఏప్రిల్ 3 లోపు కలర్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఎస్ ఎస్ సి హాల్ టికెట్ జిరాక్స్ లతో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఎం.శివప్రసాద్, లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్, ఫోన్ నెం. 7997508931 సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్ కోరారు.

## పని భారాన్ని తగ్గించాలంటూ పంచాయతీ కార్యదర్శుల వినతి



పమిడిముక్కల మార్చి 12 మేజర్ న్యూస్ : గ్రామాలలో వివిధ సర్వేలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ వంటి అంశాలతో తమకు పని భారం ఎక్కువైందని వాటిని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అధికారులకు వినతి పత్రం అందించారు. బుధవారం ఉయ్యూరు డివిజన్ అభివృద్ధి అధికారి రాజేష్ పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేశారు. కార్యా లయంలో ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే పరిశుభ్రత కార్యక్ర మాలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనకు తమపై ఉన్న పని భారాన్ని, ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ఉదయం 5 గంటల నుండి రాత్రి వరకు వివిధ పనులతో తాము గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నామని కావున తమకు పనిభారాన్ని కొంత మేరకు తగ్గించాలని ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు ఆయనను కోరారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్ రమేష్, టి వి ఎస్ ఆర్ కె ప్రసాద్, రమణ తదితరులు వినతిపత్రం అందించారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్



రెడ్డిగూడెం మేజర్ న్యూస్ : మండల పరిధిలోని నాగులూరు గ్రామములో గల యం. పి.ఎలిమెంటరీ స్కూల్, జిల్లా పరిషత్తు హైస్కూల్‌లోని మధ్యాహ్న భోజన పథకంను తహసిల్దార్ జె.సుశీలదేవి బుధవారం తనిఖీ చేశారు., పాత నాగులూరులోని 3 చౌక ధరల దుకాణంలను, 2 అంగన్వాడీ సెంటర్లను విజిట్ చేశారని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చూపిస్తున్న పి4 గృహ సర్వేను కూడా విజిట్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్వో యం. వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ పునః ప్రతిష్ట





అవనిగడ్డ, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పులిగడ్డలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మండలిబుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతులు బుధవారం నూతన ఆలయంలో శ్రీ కనకదుర్గమ్మ వారి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవంలో శిఖర ప్రతిష్ట, జీవ ధ్వజస్థంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ట అనంతరం యాగశాలలో మహాపూర్ణాహుతి సమర్పించారు. నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు అతిథులుగా విచ్చేసి ఈ సందర్భంగా అతిథులను ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, ఆలయ పెద్దలు ఘనంగా సత్కరించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సీజీఎస్ నిధులు రూ.18,33,000 లు, మ్యాచింగ్ గ్రాంట్ రూ.9,17,000లు మొత్తం రూ.27,50,000లతో పాటు భక్తుల విరాళాలు మొత్తం రూ.70 లక్షలతో ఈ ఆలయం పునర్ నిర్మాణం చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండలి వెంకట కృష్ణారావు (బాబు) తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు మండలిరామ్మోహనరావు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లపల్లి శ్రీ వాసవి భగవద్గీత భక్త బృందం అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో మహిళలు భగవద్గీత పారాయణము,లలితా పారాయణం, అష్టలక్ష్మీ పారాయణం చేశారు.

# వైసీపీ యువత పోరుబాట సిగ్గుచేటు



పెడన మేజర్ న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువత పోరుబాట కార్యక్రమం ఏర్పాటు చేయడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ నాగరాజు విమర్శించారు. ఈ సందర్భంగా బెజవాడ నాగరాజు ఒక ప్రకటనలో మాట్లాడుతూ, గత ప్రభుత్వములో ముఖ్యమంత్రిగా జగన్ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 4 వేల కోట్లకు పైగా చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసిన ఘనత గత ప్రభుత్వం కే దక్కుతుందన్నారు. జాబ్ కేలండర్ పేరుతో ఐదు సంవత్సరాలు ఉద్యోగాలు లేకుండా తాత్సరం చేసిన జగన్ ఇంటి ముందు వైసిపి నేతలు నిరసన తెలపాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు హితవు పలికారు. జగన్ ప్రభుత్వంలో విద్యార్థుల ఫీజు బకాయి నగదు మంత్రి లోకేష్ చెల్లించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలు ప్రతిపక్ష హోదా లేకుండా చీకొట్టినా ప్రతిపక్ష హోదా కావాలంటూ జగన్ చిన్నపిల్లల వలె మారం చేయడం ఆశాస్పదంగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వంలో ఫీజు రియంబర్స్మెంట్ 2,832 కోట్లు, వసతి దీవెన బకాయిలు 989 కోట్లు, పీజీ ఫీజు రియంబర్స్మెంట్ 450 కోట్లు బకాయిలు పెట్టింది మీరు కాదా అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రి నారా లోకేష్ 788 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేశారని కొనియాడారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలో నిలిచిపోయిన 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఐదు సంవత్సరాల పాటు తన సొంత సాక్షి మీడియాకు వేలకోట్ల రూపాయలు ప్రకటనల పేరుతో దోచిపెట్టి, విద్యార్థులకు ఫీజు బకాయిలు పెట్టింది నువ్వు కాదా జగన్ అని విమర్శించారు.

## కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన కైలే



పామర్రు మార్చి 12 మేజర్ న్యూస్ : ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ పై కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ కృష్ణా జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో " యువత పోరు " కార్యక్రమంలో భాగంగా పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ కృష్ణాజిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని, పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, అవనిగడ్డ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్, మచిలీపట్నం నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇంచార్జి పేర్ని కిట్టు, పెడన నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇంచార్జి ఉప్పాల రాము, పెనమలూరు నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇంచార్జి దేవభక్తుని చక్రవర్తి, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్సీపీ యువత, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.

# లూర్ధుమాత దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి







నందివాడ,మేజర్ న్యూస్: మహిమాన్వితమైన లూర్ధుమాత దీవెనలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. వెన్ననపూడి గ్రామంలో గత మూడు రోజులుగా ఎంతో వైభవంగా జరుగుతున్న లూర్ధుమాత ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే రాము మంగళవారం రాత్రి పాల్గొన్నారు. ముందుగా గ్రామ సెంటర్లో చర్చి పెద్దలు ఎమ్మెల్యే రామునకు స్వాగతం పలికారు. చర్చి ప్రాంగణంలోని విశ్వాసులకు అభివాదాలు చేస్తూ ఎమ్మెల్యే రాము ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఫాదర్ కరుణాకర్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము.... చర్చి ప్రాంగణంలోని మరియమాత, ఏసుక్రీస్తు స్వరూపాలకు నమస్కరిస్తూ ప్రార్థనలు చేశారు. ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ...ప్రసిద్ధిగాంచిన లూర్ధుమాత ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు వచ్చి వారి కోర్కెలను లూర్ధుమాత విన్నవించుకున్నారన్నారు. వారి కోర్కెలన్నీ తీర్చి ప్రజలందరికి లూర్ధు మాత సుఖసంతోషాలు శాంతిని అనుగ్రహించాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు. దశాబ్దాలు చరిత్ర ఉన్న ఉత్సవాలు ఎంతో ఘనంగా జరిగాయని, ప్రతి ఏట ఉత్సవాల నిర్వహణకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకొని గ్రామ పెద్దలు, చర్చి పెద్దలు ఎమ్మెల్యే రామును సత్కరించగా... ఆర్.సి.యం ఫాదర్లు, క్రైస్తవ మత గురువులు ఎమ్మెల్యే రాముకు ఆశీర్వాద ప్రార్థనలు అందించారు. ఉత్సవాల ముగింపు వేడుకల్లో మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, చాట్రగడ్డ రవి, వేణు, ఏసుపాదం,రాధాకృష్ణ, వెన్ననపూడి గ్రామ టిడిపి నాయకులు కోనేరు వెంకన్న, రావి సాంబశివరావు, సూరపనేని మహేష్, సూరపనేని బాబురావు, అరవ బాబి, గోగులపాటి నరేష్, సూరపనేని నాగేశ్వరరావు, కార్తీక్, సూరపనేని సుబ్రమణ్యం, గోవిందరావు,పెద్ద సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు, చర్చి పెద్దలు, వెన్ననపూడి గ్రామ పెద్దలు, చర్చి అనుబంధ విభాగాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకునేందుకు కాలువల ఆధునీకరణ పనులు చేపట్టాలి

## ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మార్చి 12 మేజర్ న్యూస్ :** కృష్ణా డెల్టాలో రైతులను ఆదుకునేందుకు కాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ తూర్పు కృష్ణా జిల్లాలో రైతులకు సకాలంలో సాగునీరు, తాగునీరు అందాలంటే కాలువలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కంకిపాడు హెడ్ రెగ్యులేటర్ కు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో క్రింది కాలువలకు నీరు రావడంలేదన్నారు. దీని ద్వారా పామర్రు, పెనమలూరు, మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గం రైతులకు సకాలంలో సాగునీరు అందే అవకాశం ఉండటం లేదన్నారు. ప్రస్తుతం 10 నుండి 20 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లయితే తాత్కాలికంగా హెడ్ రెగ్యులేటర్ కు మరమ్మతులు చేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రధానంగా అప్పర్ పుల్లేరు, లోయర్ పుల్లేరు, రామరాజు ఛానల్, ఈస్ట్ సైడ్ ఛానల్, మేడూరు ఛానల్, భీమ నది ఛానల్ లకు ఈ రెగ్యులేటర్ ద్వారానే సాగునీరు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అంతేగాక బందరు కాలువ ద్వారా మచిలీపట్నం తాగునీటి అవసరాలకు నీరు కూడా ఈ రెగ్యులేటర్ ద్వారానే వెళ్లాల్సి ఉంటుందన్నారు. పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు సత్వరం ఈ హెడ్ రెగ్యులేటర్ కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు అవసరమైన సాగునీరు అందించేందుకు అండర్ టన్నెల్స్ ను ఏర్పాటు చేయాలని కోరారు. వీటితోపాటు ఐనంపూడి, భీమ నది డ్రైన్లు కూడా ఆధునీకరించాలని, లేకుంటే భారీ వర్షాలు కురిసిన సమయంలో పొలాలు ముంపుకు గురవుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. ఈ ఆధునీకరణ పనులు చేపట్టేందుకు సంబంధిత మంత్రి, ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన సభాముఖంగా కోరారు.

# కంకిపాడు రోడ్డు సమస్య ప్రజలకు భావోద్వేగంగా మారింది



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ - కంకిపాడు రహదారి సమస్య ప్రజలకు భావోద్వేగంగా మారిందని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము బుధవారం పేర్కొన్నారు. అధ్వాన్న స్థితిలో ఉన్న రహదారి వలన జరిగిన ప్రమాదాల ఛాయా చిత్రాలను ఆయన అసెంబ్లీలో చూపించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల ప్రజల కలగా మారిన కంకిపాడు రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం సూచించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రశ్నలకు స్పందించిన ఆర్ అండ్ బీ శాఖా మంత్రి జనార్ధన్ మాట్లాడుతూ 24 కోట్లతో కంకిపాడు రహదారి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు ఈ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాలు ఆర్ అండ్ బి శాఖను వెంటాడుతున్నాయని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. గుడివాడ ప్రజలకు తీరని సమస్యల్లో కంకిపాడు రోడ్డుతో పాటు బస్టాండ్ కూడా ఒకటని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ రహదారిలో ప్రధానంగా ప్రమాద స్థితిలో ఉన్న 30కి.మీ మేర కంకిపాడు రహదారిలో సుమారు 60మంది గాయపడి వికలాంగులు కావడం జరిగిందన్నారు. ఈ రహదారి టిడిపి మాజీ ఎమ్మెల్యే రావి హరగోపాల్ ప్రాణం కూడా తీసిందన్నారు. దినదిన గండంగా మారిన కంకిపాడు రహదారిపై ఆర్టీసి అద్దె బస్సులు నడిపేందుకు కూడా వెనక్కి తగ్గిందన్నారు. ఇక ఆర్టీసి బస్సుల మరమ్మత్తుల గురించి చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈ రహదారి ఆవశ్యకత తనతో పాటు పామర్రు, గన్నవరం, పెనమలూరు, కైకలూరు ఎమ్మెల్యేలకు బాగా తెలుసన్నారు. అధ్వాన్న స్థితిలో ఉన్న కంకిపాడు రహదారికి రిటైనింగ్ వాల్ కట్టి శాశ్వత పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సభాముఖంగా ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. వైసిపి హయాంలో రహదారి అభివృద్ధికి 5 కోట్లు మంజూరు అయితే పనులు ప్రారంభించకుండా చోద్యం చూశారన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఆదేశాలతో పనులు ప్రారంభమయ్యాయన్నారు. కోటి ముప్పై అయిదు లక్షలతో గుంటలు పూడ్చే పనులు కూడా జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డుపై మన ప్రాంతం నుండే కాక భీమవరం, నర్సాపురం, అమలాపురం పరిసర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది నిత్యం రాకపోకలు సాగిస్తారన్నారు. రహదారికి ఇరువైపులా కాలువలు ఉండటంతో రోడ్డు కుంగిపోయి సమస్య అంతకంతకు పెరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ప్రసంగంపై మంత్రి పూర్తిస్థాయిలో సమాధానమిస్తూ సెంట్రల్ రోడ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ 16 కోట్లు, రాష్ట్ర విపత్తు నిధులుతో జరుగుతున్న ఈ రెండు పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేస్తామని బదులిచ్చారు.

## పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** విద్యార్థినీ విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు ప్రతిభావంతంగా వ్రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు పంచాయితీలో గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో వన్నారు కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులకు గోపు సత్యనారాయణ చేతుల మీదుగా హాల్ టికెట్లు ఇవ్వడం జరిగింది.శ్రీ సత్య సాయి సేవ సమితి వారు సంస్థ తరపున విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు అందచేశారు. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 17 వ తేదీ నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఇంకా 5 రోజులు వ్యవధి ఉన్నదని, విద్యార్థులు రాబోయే ఐదు రోజులు కష్టపడి కాక ఇష్టపడి చదివి పరీక్షలు శ్రద్ధగా వ్రాసి కానూరు పంచాయితీ కి, తాము చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. 10 వ తరగతి ఉన్నత విద్యకు పునాది లాంటిదని, విద్యార్థుల భవితను మలుపు తిప్పేదని గోపు అన్నారు. సత్యసాయి సేవ ట్రస్ట్ సభ్యులు ఆంజనేయులు, స్కూల్ కమిటీ ఛైర్మెన్ ఈమని యేసు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కంచికచర్ల మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కంచికచర్లలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గొట్టుముక్కల రోడ్ లో గల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మె వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ ఛైర్పర్సన్ కాలువ పెద్ద బాబు, ఎంపిటిసి సభ్యులు మాడుగుల మధు మాజీ మార్కెటింగ్ యాడ్ వైస్ ఛైర్మన్ మాడుగుల శంకర్, మాజీ ఎంపిటిసి సభ్యులు శేషం వాసు, జగన్ మోహన్ రావు, ఆంజనేయులు, పాండు, గురవయ్య,మంగినేని వెంకట్రామయ్య, రెడ్డి, శ్యామ్ తోడటి నరసింహ, నాగేశ్వరరావు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## హోంగార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ చెక్కులను అందజేసిన జిల్లా ఎస్పీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ, రహదారి ప్రమాదంలో మరణించిన హోంగార్డ్ కుటుంబ సభ్యులకు హోమ్ గార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్ నుండి సేకరించిన మొత్తాన్ని చెక్ రూపంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పి బి.సత్యనారాయణ, ఆర్ఐ సతీష్ కుమార్తో కలిసి వారికి అందజేశారు. 13/01/2025 వ తేదీ పదవి విరమణ పొందిన హెచ్జి 96 కె.చంద్రశేఖర రావుకి 3,85,530/- చెక్కును,, 23-01-2025 తేదీ రహదారి ప్రమాదంలో మరణించిన హెచ్జి 317 జి.యశ్వంత్ తల్లి నాగ కోటేశ్వరమ్మకి రూ.4,23,880ల చెక్కును జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మీకు ఎలాంటి సమస్య వచ్చినా, ఏ రకమైన ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా తమకు తెలుపుకోవచ్చని, మీరు ఎప్పటికీ పోలీస్ కుటుంబ సభ్యులేనని, పోలీస్ శాఖ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



**పమిడిముక్కల మార్చి 12 మేజర్ న్యూస్ :** ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తన స్వగ్రామమైన మంటాడలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు, గ్రామస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన రచించిన మంటాడ టూ మాన్ హాటన్ అనే పుస్తకాన్ని గ్రామస్తులకు, భక్తులకు అందజేశారు. ఈ పుస్తకాన్ని సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన విషయం విదితమే... ఆలయంలో పూజా కార్యక్రమాలు అనంతరం ఆయన చదువుకున్న తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అలాగే మంటాడ గ్రామంలోని గీతా మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులు, బంధుమిత్రులతో కొద్దిసేపు సంభాషించి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు.

## కెయూలో ప్రాంగణ ఎంపికలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా విశ్వవిద్యాలయంలో చైతన్య విద్యాసంస్థలు ఆధ్వర్యములో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలుకు విశేష స్పందన లభించింది.ఈ నెల 5, 6 తేదీలలో నిర్వహించిన మౌఖిక పరీక్ష, రాత పరీక్షల్లో విశ్వవిద్యాలయం కు చెందిన 66 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఉపకులపతి ఆచార్య కె రాంజీ,రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు,రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష ల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భముగా ఉపకులపతి ఆచార్య కె రాంజీ మాట్లాడుతూ భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ప్రాంగణ ఎంపికలు జరగటానికి చర్యలు ప్రారంభించామన్నారు. విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ సమన్వయకర్త డాక్టర్ కిషోర్ ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ డీన్ ఆచార్య వై కే సుందర కృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, చైతన్య విద్యాసంస్థలు అధికారులు పాల్గొన్నారు.

## పంట కోత ప్రయోగం సత్ఫలితాలు అందిస్తుంది

### మండల వ్యవసాయ శాఖ అధికారిణి హారిక



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పంట కొత్త ప్రయోగం గూర్చి రైతులు విపులంగా తెలుసుకోవాలని, ఇది రైతులకు సత్ఫలితాలు అందిస్తుందని వ్యవసాయ శాఖ వారికి ఎల్లవేళలా అండదండలు అందిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి హారిక తెలిపారు. మచిలీపట్నం మండలం తాళ్లపాలెం గ్రామంలో వేరుశనగ పంటపై పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ డెమోన్స్ట్రే షన్‌లో సుబ్బారెడ్డి, యేసుదాసులు పొలంలో పంట కోత ప్రయోగం గూర్చి సవివరంగా వివరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. 5.5 మీటర్స్ పరిధిలో వేరుసెనగ దిగుబడి 8.700 కిలోలు, 20.400 కిలోల దిగుబడిగా వచ్చినట్లు తెలిపారు. పంటకోత ప్రయోగం నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నుండి సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ నీమ్ చంద్, మండల వ్యవసాయ అధికారి డి హారిక, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం రైతుల సమక్షంలో నిర్వహించినట్లు హారిక తెలిపారు. తాళ్లపాలెం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయి కిరణ్, మీనాక్షి మంగినపూడి వివిఎ కాసింలు పాల్గొన్నారు.

## కబ్జాకు గురవుతున్న ల్యాండ్లపై విచారణ జరిపించాలి

**ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం, మార్చి 12, మేజర్ న్యూస్ : నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలో ఉన్న 9 గ్రామాలను ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చి, ప్రజల్లో నెలకొన్న కన్ఫ్యూజన్‌ను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈరోజు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. విజయవాడ రూరల్ మండలంలో 9 గ్రామాలు ఉండగా ప్రస్తుతం 2 గ్రామాలు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో, 5 గ్రామాలు పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో మిగిలిన రెండు గ్రామాలు నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నాయని, వీటన్నిటిని ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చినట్లయితే ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలవుతుందని తెలిపారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలో దాదాపు 94 వేల మంది ఓటర్లు, 1 లక్ష 70 వేల మంది జనాభా ఉన్నారని పోలీస్ స్టేషన్లు వివిధ ప్రాంతాల్లో, కమిషనరేట్ లో ఉండటం వల్ల కన్ఫ్యూజన్ నెలకొందని ప్రభుత్వం దృష్టికి తెలిపారు. విజయవాడ పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల పరిధిలోని వెంచర్లలో కామన్ ల్యాండ్లు అన్యాక్రాంతానికి గురైన పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ఉదాహరణ అంబాపురం గ్రామంలోని వెంచర్‌లో కామన్ ల్యాండ్ కబ్జాకు గురవుగా, ప్రశ్నించిన అంబాపురం గ్రామ సర్పంచ్ పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని అన్నారు. విజయ వాడ రూరల్ మండలంలోని 9 గ్రామాలను ఒకే పోలీస్ స్టేషన్ పరిధిలో చేర్చి ప్రస్తుతం ప్రజల్లో నెలకొన్న కన్ఫ్యూజన్ ను తొలగించాలని, అలాగే శివారు ప్రాంత వెంచర్లలోని కామన్ ల్యాండ్లు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని వాటిపై ఎంక్వైరీ వేయవలసిందిగా ప్రభుత్వం దృష్టికి తెలియజేశారు.

## ఏఎన్ఆర్ కళాశాలలో బ్యాంకింగ్ ఫైనాన్స్ అండ్ ఇన్సూరెన్స్ సర్టిఫికేట్ కోర్స్ ప్రారంభం



గుడివాడ, మేజర్ న్యూస్ : గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో కెరీర్ గైడెన్స్ &ప్లేస్మెంట్ సెల్, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ &బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యాన బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్లో సర్టిఫికేట్ కోర్సులను కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ కెవిస్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లీడ్ ట్రైన్ బజాజ్ ఫైనాన్సర్వీసెస్ ప్రతినిధి పి.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా బికాం, ఎంబిఏ విద్యార్థులు విద్యార్థి దశ నుండే బ్యాంకింగ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ మీద ఆచరణాత్మక జ్ఞానం సాధించాలని కోరారు. దీనికోసం బజాజ్ ఫిన్ సర్వీసెస్ లిమిటెడ్ అన్ని వేళలా తమ సహాయ సహకారాలు అందించడానికి ముందుంటుందని ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను బజాజ్ ఫిన్ సర్వీస్ లిమిటెడ్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సర్టిఫికేట్ కోర్సులో 750 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు బజాజ్ సర్వీసెస్ లిమిటెడ్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సర్టిఫికేట్ కోర్సుకు 80శాతం హాజరు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పిజెఎస్కుమార్, పాలకవర్గ వైస్ ప్రిన్సిపాల్ బిఎస్ఎస్ పద్మజ, ఎంబిఏ విభాగాధిపతి డా.ఎండి సువర్చల, కామర్స్ & బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన



మచిలీపట్నం మేజర్ న్యూస్ : బాలభాను స్కూల్లో మంగళవారం విద్యార్థుల పర్యావరణ పరిరక్షణపై ప్రదర్శించిన ఎగ్జిబిట్లు అందరిని ఆలోచింపజేశాయి సోలార్ ఎనర్జీ చంద్రయాన్ వంటి 100 పైగా అంశాలను ప్రదర్శించారు మాస్టర్ ఇ.కె.బాలభాను విద్యాలయం, మంగళవారం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికి తీసే విధంగా సైన్స్, మ్యాక్స్ కి సంబంధించిన సుమారు 200 ప్రదర్శనలను మాస్టర్ ఇ.కె.బాలభాను విద్యాలయం, విద్యార్థులు ప్రదర్శించారు నాలుగో తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులు సైన్స్, మ్యాక్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. నర్సరీ నుండి మూడో తరగతి విద్యార్థులు చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, వారి తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తప్పుడు ఆరోపణలు చేసిన షేక్ మబుపై 100 కోట్ల పరువు నష్టం దావా వేస్తున్నా

**జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్**



విజయవాడ మేజర్ న్యూస్ : తనపై తప్పుడు ఆరోపణలు చేసిన షేక్ మబు పై 100 కోట్ల పరువు నష్టం దావా వేస్తున్నానని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ)జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం గాంధీనగర్ విలేకరుల సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో పార్టీ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తూ ఉండగా అక్కడ విలేకరుల సమావేశంలో తనపై తప్పుడు ఆరోపణలు చేసిన షేక్ బాబు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బోరుగడ్డ అనిల్ కుమార్ కు మిత్రుడైన షేక్ బాబు అనే వ్యక్తి కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నాడని తెలిసిన తనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అలాంటి వ్యక్తి నెల్లూరులో ప్రెస్ మీట్ పెట్టి పార్టీలో ఆరు సంవత్సరాల క్రితం తనన్ను సస్పెండ్ చేశామని పార్టీలో కొనసాగించడం లేదని తప్పుడు ఆరోపణలు చేశారన్నారు అంతేకాకుండా మిరియాల వెంకటరావు అనే వ్యక్తి కోట్ల రూపాయిలు దందాలు చేశారని అసత్య ప్రచారాలు చేయడం మంచిది కాదని అన్నారు.10 సంవత్సరాలుగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తు విలువలకు ప్రాధాన్యనిస్తూ రాందాస్ అత్వాలే నాయకత్వంలో ప్రజాసేవ చేస్తున్నానని, 2019 వ సంవత్సరం మైలవరం ఎమ్మెల్యే గా, విజయవాడ మచిలీపట్నం పార్లమెంట్ ఎంపీగా పోటీ చేశానని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కోరకు చంద్రబాబు నాయుడు నాయకత్వం అవసరం ఉందని, కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే భాగస్వామి గా ఎన్డీఏ కూటమికి మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. రామదాసు అతావలే పదిసార్లు పైన విజయవాడకు తీసుకురావడం జరిగిందని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై పేదల పక్షాన పోరాటం చేశానని తన మీద రకరకాల వదంతులు పుట్టిస్తున్నారన్నారు. షేక్ మాబు బోరుగడ్డ అనిల్ ముఖ్యానిచరుడు అలాంటి వ్యక్తిని నెల్లూరు ప్రజలు గుర్తించాలన్నారు.పార్టీలో ఎంతో క్రమశిక్షణతో తాను ముందుకు వెళుతున్నానని తనపై పోలీస్ స్టేషన్లో ఒక పెట్టి కేసు కూడా ఇంతవరకు లేదని పేదల పక్షాన పోరాటం చేస్తున్నానని అలాంటి తనపై నీలాప నిందలు వేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ అధ్యక్షులు రామ్ శెట్టి రమేష్ కుమార్,ఏపీ కార్యదర్శి గోపి, కృష్ణా జిల్లా అధ్యక్షులు, ఎస్.కె సందీప్,అధికార ప్రతినిధి మల్లాది ప్రసాద్, తుమ్మల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదవాడి ఇంటికల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



నందిగామ, మార్చి 12, మేజర్ న్యూస్: స్వర్ణాంధ్ర విజన్ – 2047 లో భాగంగా 2029 కల్లా "అందరికీ గృహాలు నందిగామ డివిజన్ లో నిర్మించి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చుతామని నందిగామ ఆర్ డి ఓ కె. బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం నందిగామ ఆర్ డి ఓ కార్యాలయం లో జరిగిన విలేకరుల సమావేశం లో ఆర్ డి ఓ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వము ఎస్సి, ఎస్టీ బిసి లబ్ధిదారులకు గృహ నిర్మాణం ప్రోత్సాహకాల క్రింద అదనపు ఆర్థిక సహాయమును మంజూరు చేయడానికి జిఓ నెం.9 జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన లబ్ధి దారులకు గృహ నిర్మాణ విషయం లో, ప్రస్తుత నిర్మాణంలో ఉన్న అన్ని గృహాలకు ప్రస్తుతం ఇచ్చిన ఆర్థిక సహాయం కన్నా అదనముగా ఆర్థిక సహాయం మంజూరు చేస్తామని తెలిపారు. లబ్ధిదారుల గృహ నిర్మాణం పూర్తి చేయుటానికి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సదరు జిఓ ప్రకారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ, గ్రామీణ) 1.0 & పిఎం జన్మాన్ పథకాల కింద ప్రభుత్వం మంజూరు చేయబడిన ఎస్సి, ఎస్టి, బిసిల లబ్ధిదారులకు యూనిట్ ఖర్చుకు అదనంగా ఎస్సి, బిసి లబ్ధిదారులకు రూ.50,000ల, ఎస్టి లబ్ధిదారులకు రూ.75,000ల పివిజిటి లబ్ధిదారులకు 1,00,000ల అదనపు ఆర్థిక సహాయం అందించటం జరుగుతుందని తెలిపారు. సదరు లబ్ధి దారులు త్వరిత గతిన గృహ నిర్మాణం చేపట్టి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.నందిగామ డివిజన్‌లో 2794 గృహ నిర్మాణ లబ్ధిదారులను గుర్తించటం జరిగిందని తెలిపారు. యస్.సి. లబ్ధిదారులు 1495, యస్.టి.లబ్ధిదారులు 175, బి.సి. లబ్ధిదారులు 1124 వున్నారని తెలిపారు. నందిగామ, జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్లు పెండింగ్ పూర్తి చేయడానికి టిడ్కో అధికారులతో సమీక్ష ఏర్పాటు చేస్తామని తెలిపారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. నందిగామ తహశీల్దారు సురేష్, హౌసింగ్ డిఇ శివాజీ, ఎఇలు వెంకటేశ్వరరావు,ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 15 వందల మంది ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ



ఎ.కొండూరు, మేజర్ న్యూస్: తిరువూరు పట్టణానికి చెందిన ఆబిదా ఖాతూన్ ప్రతి ఏడాది పవిత్ర రంజాన్ మాసంలో తన భర్త ఆరిఫ్ అహ్మద్ జ్ఞాపకార్థంగా నిరుపేద ముస్లిం సోదరులకు, మహిళలకు రంజాన్ తోఫా అందజేస్తుంటారు. ఈ ఏడాది కూడా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తిరువూరు పట్టణానికి చెందిన ముస్లిం సోదరులకు మహిళలకు,ఎ. కొండూరు మండలం చీమలపాడు, కృష్ణారావు పాలెం గ్రామాలకు చెందిన నిరుపేద ముస్లిం మహిళలకు బుధవారం రంజాన్ తోఫా అందజేశారు. తిరువూరు లోని శాంతినగర్, అశోక్ నగర్,తోళ్ల బజార్, తంగెళ్ల బీడు, చింతల కాలనీ, సుందరయ్య కాలనీ, రాజుపేట, ఒడ్డు మీద బజారు, అప్పడాల పేట, లైన్ బజార్, ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద ముస్లిం మహిళలు సుమారు 1300 వందల మందికి, చీమలపాడు, కృష్ణారావు పాలెం గ్రామాల్లోని 200 మంది నిరుపేద మహిళలు ఒక్కొక్కరికి రెండు వేల విలువ చేసే చీరలు, పండుగకు కావలసిన నిత్యావసర సరుకులు జకాత్ రూపేణా ఆప్యాయత, అనురాగాలతో పంపిణీ చేస్తూ దాతృత్వాన్ని చాటుకున్నారు. తిరువూరులోని సుమారు 3,000 మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాజుపేటలో మసీదు నిర్మాణానికి రూ 20 లక్షలతో స్థలాన్ని కొనుగోలు చేసి శంకుస్థాపన చేశారు. త్వరలో మసీదు నిర్మాణం చేపడతామని తెలిపారు.తిరువూరు పట్టణానికి చెందిన వారే కాక, చీమలపాడు గ్రామానికి చెందిన కొంతమంది నిరుపేద విలేకరులకు కూడా దుస్తులు నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆబిదా ఖాతూన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ధనిక, బీద తేడా లేకుండా అందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో తనకు ఉన్నదాంట్లో,తనకు తోచిన విధంగా తన భర్త జ్ఞాపకార్థం ఆర్థిక సహాయం అందిస్తూ పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నట్లు తెలిపారు. మానవసేవయే మాధవ సేవ అని, ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్నారు. రంజాన్ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే వెయ్యి రూపాయలు దానం చేసినంత పుణ్య ఫలాలు లభిస్తాయన్నారు.ధనికులు పేదలకు సహాయం చేసే ఉదార గుణాన్ని అలవర్చుకొని పుణ్య ఫలాలను పొందాలని కోరారు. అంతకుముందు ఆబిదా ఖాతూన్ కు,సోదరికి విలేకరి ఖాజా మొహిద్దీన్, సతీమణి హబీబున్ శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నయిమాఖాతూన్, ఖిజర్ అలీ (సిజ్జి) ముస్లిం మహిళలు పాల్గొన్నారు.



## పేద ప్రజల పార్టీ వైసీపీ

ఘంటసాల, మేజర్ న్యూస్: ప్రజా సంక్షేమ అభివృద్దే ధ్యేయంగా ప్రారంభమైన వైఎస్సార్సీపీ నిత్యం ప్రజల పక్షాన పోరాడుతుందని వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు అన్నారు. ఘంటసాల ప్రధాన సెంటర్లో వైఎస్సార్సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్ వైఎస్సార్సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంచారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు దిరిశం పిచ్చేశ్వరరావు, జె. సోమ సుందరరావు, యార్ల జనార్ధన, అంగడాల నాగరాజు, గొర్రెపాటి గోపాల కృష్ణ, వేమూరి రాజబాబు, కొడాలి గంగాధర రావు, గుర్రం అంజయ్య, ఆకురాతి భాస్కరరావు, శ్రీను, తిరుమలశెట్టి సీతారాం బాబు, కొడాలి బాబురావు, గద్దె నాగేశ్వరావు, యార్ల సత్యవర్ధన్, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా వైకాపా 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా భారీ కేకును సింహాద్రి రమేష్ బాబు పలువురుతో కలిసి కట్ చేసి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం కార్యాలయ ఆవరణలో ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీగా వంతెన సెంటర్లో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు. పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి వెంట నడిచిన పార్టీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు సంతోషంగా ఉండాలి అన్నదే వైఎస్ఆర్సిపి లక్ష్యం అని అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజల కోసం పరితపించే నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని సింహాద్రి అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 9 నెలల కాలంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని రైతులకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించాలని విద్యార్థులంతా రోడ్డు ఎక్కే పరిస్థితి వచ్చిందని ఎన్నికలలో అలిమి కానీ వాగ్దానాలు ఎన్నో చేసి ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టారు అని అన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాడే అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నాడని అందులో భాగంగా 12వ తేదీ బుధవారం యువత పోరు కార్యక్రమంలో భాగంగా కలెక్టర్లకు యువత విద్యార్థుల సమస్యలపై మెమొరండం సమర్పించే అందుకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోరుముచ్చు ఉమా, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్,జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ,ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలకుర్తి పృథ్వీరాజులతోపాటు నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట తప్పని నాయకుని విశ్వసనీయతకు ప్రతీక వైసీపీ



**పామర్రు మార్చి 12 మేజర్ న్యూస్ :** ఇచ్చిన మాట తప్పని ఓ నాయకుని విశ్వసనీయత కు ప్రతీక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, స్థానిక మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పామర్రు పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ కుట్రలకు, అక్రమ కేసులకు తలొగ్గని ఒక్క ధీరుని ప్రస్థానం ఈపార్టీ అని పేర్కొన్నారు. దివంగత మహా నేత వైఎస్సార్ సంక్షేమ పథకాలే జెండాగా.. అజెండా నే ఎజెండాగా, ప్రజల ఆశలే ఊపిరిగా పురుడు పోసుకున్న ప్రజల పార్టీ వైసీపీ అన్నారు. ఇన్ని సంవత్సరాలుగా పోరాటబాటలో ప్రస్థానాన్ని సాగిస్తూ ఈ రోజు 15వ వసంతం లోకి అడుగు పెడుతున్న వేళ.. ఈ ప్రస్థానం లో పార్టీకి వెన్నంటి నిలిచిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, సోషల్ మీడియా కార్యకర్తల కు హృదయ పూర్వక ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జండా ను అనిల్ కుమార్ ఎగురవేశారు. అనంతరం కార్యాలయంలో డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కేకును కట్ చేసి నాయకులు, కార్యకర్తల సమక్షంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలోని మొవ్వ, పమిడిముక్కల, తోటవల్లూరు, పెదపారుపూడి మండలాల పార్టీ అధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, యలమంచిలి గణేష్, కళ్ళం వెంకటేశ్వర రెడ్డి, గోళ్ల సోమేశ్వరరావు, పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, పమిడిముక్కల మాజీ ఎంపీపీ శౌంతి వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, సమ్మెట ఆంజనేయులు, పార్టీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, దేవభక్తుని రాము, రాజులపాటి మురళి, తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్న.. ప్రతిపక్షంలో ఉన్న ప్రజల సంక్షేమమే జగన్ లక్ష్యం





**గుడివాడ, మేజర్ న్యూస్ :** అధికారంలో ప్రజల సంక్షే మానికి అహర్నిశలు శ్రమిం చిన జగన్- ప్రతిపక్షంలో ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాల చేస్తున్నారని వైఎస్ఆర్సిపి నాయకులు పేర్కొన్నారు. గుడివాడ పట్టణంతోపాటు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ15వ ఆవి ర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఉదయం ఘనంగా జరిగాయి. ముందుగా 35 వార్డులోని స్వర్గీయ వైఎస్ ఆర్ విగ్రహానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు పాలేటి చంటి, సంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్ తదితర నాయకులు పూలమాలతో నివాళులర్పించి జోహార్ వైయస్ఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం వైసిపి జెండా ఆవిష్కరిం చిన నాయకులు, కేక్ కట్ చేస్తూ పార్టీ శ్రేణులకు తినిపిస్తూ,ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్న గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో ఒక పార్టీ ఎలా ఉండాలో ఎలా పరిపాలన చేయాలో ఆదర్శవంతంగా చూపిన పార్టీ వైసీపీ అని నాయ కులు పేర్కొన్నారు. చంద్రబాబు కుయుక్తులు, కుట్రలు పన్ని అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. పార్టీ ఆవిర్భా వ దినోత్సవం రోజు కూడా విద్యార్థుల కష్టాలపై పోరాటాలకు పిలుపునిచ్చిన గొప్ప నాయకుడు జగన్ అని పార్టీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, జడ్పిటిసి గొళ్ల రామకృష్ణ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులిమిల్లి యశయ్య, క్రిస్టియన్ సెల్ నాయకులు ఏలేటి విలియం జోషి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు కే పవన్ కుమార్, పార్టీ నాయకులు తోట రాజేష్ దుడ్డు చిన్న, కొర్నిపాటి గణపతి, మాదాసు వెంకటలక్ష్మి, ఎన్ వి మోహన రెడ్డి, చుండూరి శేఖర్, కొంకితల ఆంజనేయ ప్రసాద్, పొట్లూరి కృష్ణారావు, రమణ కుమార్, ఖాదర్ బేగ్, లోయ రాజేష్, తంటేపూడి అనిల్, మూడెడ్ల ఉమా, ఎం.సురేఖ, కళావతి, పుల్లేటికుర్తి కృష్ణ(పెద్దారెడ్డి), ప్రసాద్, టైలర్ రాజేష్, దూడల సత్యనారాయణ (బాబాయ్),గంటా సురేష్, గుడివాడ వైఎస్ఆర్సిపి అనుబంధ, విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. గుడివాడ రూరల్ మండలంలో పార్టీ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, జడ్పిటిసి గొళ్ల రామకృష్ణ, సీనియర్ నాయకులు సాయన నాగబాబు,చిన్ని శ్రీనివాసదుర్గ, మేక సత్యనారాయణ, గద్దే రాము, ఎంపీపీ గద్దె పుష్పరాణి, పార్టీ నాయకులు మసిముక్కు ఈశ్వర్ కుమార్, వీర బత్తిన శ్రీహరి, వల్లూరి చంటిబాబు, మహేంద్ర, గిరి, గూడపాటి శ్రీకాంత్, కర్రే నాని,కర్రే చిన్ని, మండల వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆయిల్ ఫల్మ్ మినుము కరపత్రాలు విడుదల

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాలలో బుధవారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. డి సుధారాణి ఆధ్వర్యంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం సహా పరిశోధన సంచాలకుల ఇన్చార్జి డా. వి. శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విస్తరణ సహా సంచాలకులు డా. వి. విశాలాక్షి పాల్గొని ప్రసంగిస్తూ 2024-25 సంవత్సరంలో కృషి విజ్ఞాన కేంద్రం చేపట్టినా క్షేత్ర పరిశీలనలు, విస్తరణ కార్యక్రమాలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనలు, శిక్షణా వాటి ఫలితాలును రైతులకు శాస్త్రవేత్తలకు వ్యవసాయ శాఖ వాళ్లకు వివరణ ఇచ్చారు. రైతులతో వ్యవసాయ సంబంధిత సమస్యలపైన చర్చ గోష్ఠి నిర్వహించి వాళ్ళు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పుతూ రానున్న రోజుల్లో కొత్త తరహా మినుము, వరి రకాలు ఆచరణ లోకి తీసుకుని రావాలన్నారు. ఈ శాస్త్రీయ సలహా మండలి సమావేశం సందర్భంగా కేవికే తరుపున రెండు కరపత్రాలు (ఆయిల్ పల్మ్, మినుము) ముఖ్య అతిథులు చేతులమీదుగా విడుదల చేశారు. కృష్ణా జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ వై వి ఎస్ మనోహర్, జిల్లా ఉద్యాన అధికారి జె జ్యోతి, ఆత్మ డైరెక్టర్ యూ నరసింహారావు, జిల్లా వనరుల కేంద్రం తరుపున కె. జ్యోతి రమణి ప్రధాన శాస్త్రవేత్తలు డా వి. సత్యాప్రియా లలిత, డా. కె. నాగేంద్రరావు, కేవికె శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నీటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు పరివేక్షిస్తుండండి






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** చలివేంద్రాలలో నీటి కొరత లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తుండండని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం ఇంజనీరింగ్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి చలివేంద్రాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో నగర పాలక సంస్థ పరిధిలో గల 77 చలివేంద్రాలలో ఎటువంటి తాగునీటి కొరత ఉండకూడదని ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ తాగునీరు నిత్యం ప్రజలకు అందేటట్టు చూసుకోవాలని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సర్కిల్ పరిధిలో పర్యవేక్షిస్తూ తమ తమ సర్కిల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలే కాకుండా ఇంకానూ అవసరమైతే ఏర్పాటు చేయవలసిన చలివేంద్రాలు ఏమన్నా ఉన్నచో వెంటనే ఏర్పాటు చేసి ప్రజలకు చలివేంద్రాలలో తాగునీటి కొరతను ఉండకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇప్పుడు వరకు సర్కిల్ 1 పరిధిలో 22, సర్కిల్ 2 పరిధిలో 27, సర్కిల్ 3 పరిధిలో 28, చలివేంద్రాలు ఏర్పాటు చేయగా, చలివేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పర్యవేక్షిస్తూ ఫ్లోటింగ్ జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాలలో స్టాక్‌ను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు.

## థియేటర్లలో ఆకస్మిక ఫైర్ తనఖీ




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కళామందిర్ థియేటర్, శైలజ థియేటర్ కాంప్లెక్స్, రాజ్ యువరాజ్ థియేటర్ కాంప్లెక్స్ లో ఆకస్మిక తనఖీ నిర్వహించారు వీఎంసి ఫైర్ సిబ్బంది. ఫైర్ సేఫ్టీ సిస్టమ్స్ థియేటర్ వారితోనే ఆపరేట్ చేయించడమే కాకుండా థియేటర్ మొత్తంలో అగ్నిమాపక నివారణ చర్యలు తీసుకున్నారా లేదా వంటి విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. థియేటర్‌కి కావాల్సిన అగ్నిమాపక నివారణ చర్యలు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించి పనిచేనివాటిని సత్వరమే పునరుద్ధరించుకొని అగ్నిమాపక నివారణ చర్యలు కచ్చితంగా పాటించాలని థియేటర్ మేనేజ్మెంట్ వారిని హెచ్చరించారు. ఈ పర్యటనలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు స్టేషన్ ఫైర్ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

# అత్యంత కచ్చితత్వంతో రీసర్వే పనులు



## ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో/కంచికచర్ల, మార్చి 12, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ యజమానుల సమక్షంలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రీసర్వే పనులు జరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కంచికచర్ల మండలం, గండేపల్లిలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలిం చారు. గ్రామం పరిధిలో సర్వే పురోగతిని రికార్డుల ఆధారంగా పరిశీలిం చారు. రీసర్వేలో కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని.. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా రీసర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులకు స్పష్టం చేశారు. రీసర్వే బృందాలు షెడ్యూల్ ప్రకారం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సభల నిర్వ హణ, ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎఫ్‌పీవోఎల్ఆర్), తప్పనిసరి పర్యవేక్షణ, తహసీల్దార్ చెక్‌లిస్ట్‌తో పాటు వివిధ రకాల చెక్‌లిస్టులు, రీసర్వే పబ్లిసిటీ, గ్రామసభ నిర్వహణ, రోజువారీ పర్యవేక్షణ ప్రొఫార్మా తదితరాల వివరాలు అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను భూ వివాద రహితంగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న రీసర్వే పనులపై క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే, భూ రికార్డులు) టి.త్రివిక్రమరావు, కంచికచర్ల ఎమ్మార్వో మానస, గ్రామ సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

# మహిళా సాధికారతతోనే సమాజ అభ్యున్నతి

### మహిళలను ఆర్థికంగా పైకి తీసుకురావాలనే పట్టుదలతో సీఎం చంద్రబాబు ఉన్నారు

### ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, మార్చి 12, మేజర్ న్యూస్:** మహిళా సంక్షే మం, భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోం దని ఏపీ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మహిళ సామాజిక, ఆర్థిక పురోగతి సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు వివరించారు. బుధవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మహిళా సాధికారత పై సుదీర్ఘంగా మాట్లాడారు. మహిళలకు ఆస్తిలో వాటా కల్పించడం నుంచి విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించడం వరకు మహిళాభ్యుదయ కార్యక్రమాలు ఎన్నో చేసి ఫలితాలను సాధించామని గుర్తుచేశారు. తాజాగా 2025- 26 వార్షిక బడ్జెట్‌లో మహిళా శిశు సంక్షేమం కోసం ఎన్నడూ లేని విధంగా రూ.4,332 కోట్లు కేటాయించడం ద్వారా వారి సంక్షేమానికి కట్టుబ డి ఉన్నామని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతం లాంటి చర్యలతో పేద మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచే స్తున్నామని అన్నారు. మహిళాభివృద్ధితోనే సమాజాభివృద్ధి అని బలంగా నమ్మి పనిచేస్తున్నామని తెలిపారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నాం అని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు మార్కాపురంలో రికార్డు స్థాయిలో రూ.5.13కోట్లమేర లక్షకుపైగా డ్వాక్రా ఉత్పత్తులు విక్రయించారు. ఇదొక గిన్నిస్ రికార్డు.. అలా సాధించిన గిన్నిస్ రికార్డును సీ ఎం చంద్రబాబుకు అందచేశారనీ గుర్తు చేశారు. సెర్ప్, మెప్మా, ఎంఎస్ఎంఈలో స్వయంఉపాధి, ఆర్థిక వెసులు బాటు కల్పించి లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిం దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 73 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు ఇస్తామ న్నారు. ఈ మేరకు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.9,407 కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. గత వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి మహిళలను అవమానించారని దాని పర్యవసానమే 11 సీట్లకు పరిమితమై ఈరోజు శాసనసభకు కూడా రాలేని పరిస్థితికి వచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్త్రీ కంట కన్నీరు రాకుండా చేయాలని సభాముఖంగా విన్నవించారు. నందిగామ నియోజకవర్గంలో ఐదుగురు మహిళలు తోటి కోడళ్ళు తీసుకొని స్వీట్ల వ్యాపారం ప్రారంభించి నెలకు 15000 రూపాయలు సంపాదిస్తున్నారని చెప్పారు. చిన్న మొత్తంలో పచ్చళ్ళ వ్యాపారం ప్రారంభించి విజయం పొంది కుటుంబానికి ఆసరా అయ్యారని గుర్తు చేశారు. మస్తాన్వలి గ్రూప్స వారు వైర్లతో బట్టలు అమ్మి స్టాల్స్‌కి వెళ్లి విక్రయించి సంపాదించుకునే పరిస్థితికి వచ్చారని తెలిపారు.

# నందివాడలో వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నందివాడ, మేజర్ న్యూస్:** ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో తామంత నిరంతరం పోరాటాలు చేస్తామని నందివాడ మండల వైసీపీ అధ్యక్షుడు ఎంపీపీ పెయ్యల ఆదాం తెలిపారు. నందివాడ గ్రామంలో వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఎంపీపీ ఆదాం వైసిపి జెండాను ఎగరవేసి, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు, గ్రామస్తులకు నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వైసిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం జగన్ నాయకత్వంలో సైనికుల మాదిరి పనిచేసిన కార్యకర్తలందరికీ పార్టీ నాయకులు సాల్యూట్ చేస్తున్నా మన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల సంక్షేమమే జగన్ లక్ష్యమన్నా రు. కుట్ర పడుతున్న అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గుర్తించారని, జగన్ లాంటి మంచి సీఎంను కోల్పోయినందుకు రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారని పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు మచిలీపట్నంలో జరగనున్న యువత పోరు నిరసన కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కందుల దుర్గా భవాని, సీనియర్ నాయకులు కందుల నాగరాజు, తోట నాగరాజు, కొండపల్లి రంగారెడ్డి, రాజులపాటి చంద్రశేఖర్, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, నాగేశ్వరరావు,గుల్లపూడి చంద్రశేఖర్, చింతాడ నాగూర్, మండల వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో వైఎస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవి ర్భావ దినోత్సవం సం దర్భంగా గుడ్లవల్లేరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో బుధవారం గుడ్లవల్లేరు గ్రామం లోని ఫ్లైఓవర్ పైన జన హృదయనేత కీ.శే. వైఎస్ రాజ శేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలువేసి, నివాళులర్పించి, కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం మచిలీపట్నంలో జరుగుతున్న "యువతపోరు" ఫేజు నిరసనకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళుతున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, గుడ్లవల్లేరు ఎంపిపి కొడాలి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మట్ట కమల, పిన్నమనేని రాఘవేంద్ర రావు, యూత్ నాయకులు గుదే రవి, రాష్ట్ర పార్టీ నాయకులు జాన్ బెన్నీ లింగం, కొడాలి సుధాకర్, స్వాతి సాయి, గిరదా లక్ష్మీ, కొడాలి శివ, మహమ్మద్ బాజీ తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**నందిగామ, మార్చి 12, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల తో కలసి పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ జగన్మోహనరావు పార్టీ కార్యాలయంలో దివంగత మహా నేత వై.యస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలు చేసి నివాళులు అర్పిం చారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటై 14 వసంతాలు పూర్తి చేసుకొని 15వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉం టుందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా రాజశేఖరరెడ్డి ఆశయాలను అమలు చేయడానికి పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నుండి నాయకులు, మహిళా నాయ కులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## చైల్డ్‌హుడ్ సేవా కార్యక్రమాలు అపూర్వం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం మహా పుణ్య ప్రదమని ఫైర్ స్టేషన్ అధికారి పిఎస్ వి వి ప్రసాద్ అన్నారు దివిసీమలో చైల్డ్‌హుడ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అపూర్వము అని చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులను అభినందించారు బుధవారము కోర్టు సెంటర్లోని చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఫైర్ అధికారి ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అన్నారు గత ఐదు సంవత్సరాలుగా దివి సీమలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తూ మన్ననలు పొందుతున్నారు అన్నారు చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ దీవి లీలా కృష్ణ మాట్లాడుతూ 1981.. 1984 మధ్యకాలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 9 10 తరగతిలో విద్యను అభ్యసించిన విద్యార్థులు వారి మిత్రబృందం అంతా గ్రూపుగా ఏర్ప డి తల్లిదండ్రులకు సొంత గ్రామానికి ఎంతో కొంత మంచి పేరు తేవాలని ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో బండే శ్రీను మోపిదేవి శ్రీనివాసరావు రేపల్లె మురళీధర్ నీలకంఠం రామ్మోహన్ అద్దేపల్లి నాగేశ్వరరావు పరుచూరి మురళీకృష్ణ లతో పాటు గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999